క్లుప్తంగా

దళితుల ఐక్యతకే మంద కృష్ణ పోరాటం



మాట్లాడుతున్న నాగరాజు

తిరుపతి కల్చరల్ : దళితుల ఐక్యత కోసమే మందకృష్ణ మాదిగ పోరాటం చేస్తున్నారని, ఆయనపై విమర్శలు సరికాదని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మందకృష్ణ కృషిని నీరుగార్చేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు ఏక సభ్య కమిషన్ ప్రతినిధిగా విశ్రాంత ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రాను నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్ర, నేతలు నరేంద్ర, రామకృష్ణ, చిన్న గోపి, వాసుదేవరావు, రాజేంద్ర, గోపాల్ పాల్గొన్నారు.

నాగాలమ్మ సేవలో టీటీడీ బోర్డు సభ్యుడు


ఆలయంలో మహేందర్ రెడ్డి దంపతులు

చంద్రగిరి : స్థానిక నూర్ జంక్షన్ సమీపంలోని నాగాలమ్మ ఆలయానికి బుధవారం టీటీడీ బోర్డు సభ్యుడు మహేందర్ రెడ్డి దంపతులు విచ్చేశారు. ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. నాగాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహేందర్‌రెడ్డి దంపతులను అర్చకులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

అలిపిరిలో 'రీల్స్'పై ఆగ్రహం


అలిపిరి సమీపంలో డాన్స్ చేస్తున్న యువతి

తిరుమల : అలిపిరి చెక్ పాయింట్ వద్ద ఓ యువతి సినిమా పాటకు డాన్స్ చేస్తూ వీడియో తీసుకుని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంపై భక్తులు మండిపడుతున్నారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా కొందరు యూట్యూబర్లు రీల్స్ చేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఈ క్రమంలోనే యువతి చేసిన వీడియో వైరల్ కావడంతో విజిలెన్స్ వారు విచారణ చేపట్టారు. ఆ యువతి తిరుపతికి చెందని పూజితగా గుర్తించారు. దీనిపై తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయనున్నట్లు సమాచారం. అయితే తాను అవగాహన లేక అలిపిరి వద్ద నృత్యం చేశానని, శ్రీవారిపై భక్తిప్రపత్తులు ఉన్నాయని యువతి తెలపింది. భక్తులు క్షమించాలని కోరింది.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ


మాట్లాడుతున్న డీపీఎం షణ్ముగం

రామచంద్రాపురం: స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం గ్రామ సంఘం లీడర్లకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ తరగతులు చేపట్టారు. రెండు రోజులపాటు కొనసాగనున్న శిక్షణలో జిల్లా ప్రకృతి వ్యవసాయ డీపీఎం షణ్ముగం మాట్లాడుతూ ప్రకృతి సేద్యం ద్వారా పండించిన ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న ఏటీఎం మోడల్, ఏ–గ్రేడ్, డీఆర్పీ మోడల్స్‌పై శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఎస్‌ఆర్‌పీ భానుమూర్తి, ఏపీఎం గురుమూర్తి, బీపీఎం దుర్వాసులు నాయుడు పాల్గొన్నారు.

'నీరాజనం' కళాకారులకు ప్రశంస


ప్రశంసాపత్రాలు అందిస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీలో ఆదివారం నిర్వహించిన కృష్ణవేణి సంగీత నీరాజనంలో ప్రతిభను ప్రదర్శించిన జాతీయ సంస్కృత వర్సిటీ యువ టూరిజం క్లబ్ సభ్యులకు బుధవారం ప్రశంసాపత్రాలు అందించారు. ఈ మేరకు సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సూర్యనారాయణ, డాక్టర్ రాజేష్, మీనా, రాహుల్ పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

తిరుపతి తుడా : స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. డైరెక్టర్, వీసీ ఆర్‌వీ కుమార్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ర్యాలీ, సాంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి, డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, డాక్టర్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభల తేజం







తిరుచానూరు పద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం విశేష ప్రభలపై అమ్మవారు విహరించారు. గోవర్ధనగిరిధారి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. దర్బార్ కృష్ణుని అవతారంతో అశేష జనులను కటాక్షించారు. సిరులతల్లిని సేవించుకుని భక్తులు తన్మయత్వం చెందారు. కర్పూరనీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలోనే వాహన సేవల్లో వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళాకారులు ప్రత్యేక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. - చంద్రగిరి

జ్ఞాపకాలను మరువలేఖ




తోకలేని పిట్ట తొంబైమైళ్ల ఎగురుతుంది.. అని ఉత్తరాలకు నానుడి ఉండేది. అయితే ఆధునిక కాలంలో టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో కంప్యూటర్లు.. ట్యాబ్‌లు.. సెల్‌ఫోన్‌ల మెరుపుల ముందు తోకలేని పిట్ట గూటికే పరిమితమైంది. మెయిల్స్.. వాట్సాప్ చాట్స్.. జూమ్ మీటింగ్స్ యుగం ప్రారంభం కావడంతో ఉత్తరప్రత్యుత్తరం అనేది జ్ఞాపకంగా మిగిలిపోయింది. ఈ క్రమంలో తపాలా శాఖ 'ధాయ్ అఖర్' పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉత్తరాల ద్వారా వ్యాస రచన పోటీలకు కార్యాచరణ రూపొందించింది. విజేతలకు నగదు బహుమతులు అందించేందుకు సన్నద్ధమైంది. లేఖలకు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది.


తిరుపతి హెడ్ పోస్టాఫీస్



- తపాలా శాఖ ఆధ్వర్యంలో 'ధాయ్ అఖర్'
- పిల్లలు.. పెద్దలకు వ్యాస రచనల పోటీలు
- ఇన్‌లాండ్ లెటర్, ఎన్వలప్ కవర్‌లోనే పంపేలా నిబంధనలు
- విజేతలకు జాతీయ, రాష్ట్రస్థాయిలో నగదు బహుమతులు
- ఉత్తరాలకు పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా పోస్టల్ అడుగులు

తిరుపతి సిటీ : టెక్నాలజీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో విద్యార్థుల నుంచి పెద్దల వరకు సామాజిక మాధ్యమాలపైనే ఆధార పడుతున్నారు. సెల్‌ఫోన్ ద్వారా బంధుమిత్రుల యోగక్షేమాలను విచారిస్తున్నారు. కార్యాలయాలు, కంపెనీలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో సైతం మెయిల్స్, వాట్సాప్ ద్వారా సకలం జరుగుతున్నాయి. గూగుల్ మీట్, జూమ్ మీట్ ద్వారా సమావేశాలు నడిచిపోతున్నాయి. విద్యాలయాల్లో డిజిటలైజేషన్ విప్లవం ఊపందుకుంది. విద్యార్థులు స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లను వినియోగిస్తున్నారు. ఉపాధ్యాయులు సైతం ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులలో ఉత్తరాలు రాయడం, ప్రత్యుత్తరాలు తీసుకోవడం కనుమరుగవుతోంది. దీంతో తపాలా శాఖ ఆలస్యంగా అయినా మేల్కొంది. ఉత్తరాల విలువ, ప్రాముఖ్యత, విశేషాలను విద్యార్థులకు తెలియజేయాలనే సదుద్దేశంతో సరికొత్త ఆలోచనకు తెరతీసింది. ధాయ్ అఖర్ పేరిట వ్యాసాలను స్వహస్తాలతో రాసి ఇన్‌లాండ్ లెటర్, ఎన్వలప్ కవర్ ద్వారా తమకు పంపాలని కోరుతోంది. అందులో ఉత్తమ వ్యాసాలను ఎంపిక చేసి జాతీయ, రాష్ట్ర స్థాయిలో నగదు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందించనుంది.

బహుమతులు ఇలా..

- రాష్ట్రస్థాయిలో విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ. 10వేలు, తృతీయ బహుమతిగా రూ. 5వేలు అందించనున్నారు.
- జాతీయ స్థాయిలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.50వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు పంపిణీ చేయనున్నారు.

పంపాల్సిన చిరునామా ఇదీ..
సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్, తిరుపతి డివిజన్,
తిరుపతి–517501

సద్వినియోగం చేసుకోవాలి



ఒకప్పుడు చేతిరాతతో రాసిన లేఖలు బాంధవ్యాలను బలోపేతం చేసేవి. వ్యక్తుల మధ్య అనురాగం, ఆప్యాయత, అభిమానానికి ప్రతీకలుగా ఉత్తరాలు నిలిచేవి. మారుతున్న కాలానికి అనుగుణంగా అందరూ సాంకేతికత వైపు మొగ్గు చూపుతున్నారు. లేఖలు రాసే పాత సంస్కృతిని ముందుకు కొనసాగించాలనే లక్ష్యంతో తపాలాశాఖ ధాయ్ అఖర్ పేరుతో పోటీలు నిర్వహిస్తోంది. ఈ అవకాశాన్ని ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి,
- జి.నరసప్ప, సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్, తిరుపతి

ఉత్తరం రాయాల్సింది ఇలా..

- ది జాయ్ ఆఫ్ రైటింగ్‌లో భాగంగా ఇంపార్టెన్స్ ఆఫ్ లెటర్స్ ఇన్ ఏ డిజిటల్ ఏజ్ అనే అంశంపై ఉత్తరం రాయాల్సి ఉంటుంది.
- హిందీ, ఇంగ్లిష్‌తో పాటు ఏ ప్రాంతీయ భాషలో అయినా లేఖ రాయవచ్చు
- కచ్చితంగా ఇన్‌లాండ్ లెటర్ లేదా ఎన్వలప్ కవర్‌లోనే రాసి పంపాల్సి ఉంటుంది
- ఎన్వలప్ కవర్‌లో రాసేవారు ఏ4సైజ్ తెల్ల కాగితంలో 1000 పదాలకు మించకుండా వ్యాసం పూర్తి చేయాల్సి ఉంటుంది
- ఇన్‌లాండ్ లెటర్‌లో రాసేవారు 500 పదాలకు మించకుండా వ్యాసం రాయాలి
- 18 ఏళ్ల లోపు వారు ఓ విభాగం, 18ఏళ్ల పైబడిన వారు మరో విభాగంగా విభజించారు.
- విద్యార్థులతో పాటు సాధారణ ప్రజానీకం సైతం పోటీలో పాల్గొనవచ్చు
- విద్యార్థులైతే జనన ధ్రువీకరణపత్రం జత చేయాల్సి ఉంటుంది.
- ఉత్తరం కవర్ మీద తప్పనిసరిగా వయసు రాయాలి.
- లెటర్‌ను ఈ నెల 14వ తేదీలోపు పంపించాలి.

ప్రొఫెసర్‌పై దాడి హేయం

తిరుపతి సిటీ : ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఈఈఈ విభాగం ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి హేయమని పౌర చైతన్య వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాకా ప్రసాద్, ఏఎన్ పరమేశ్వరరావు మండిపడ్డారు. బుధవారం వారు మాట్లాడుతూ వర్సిటీలో అన్యమత ప్రచారం చేస్తుంటే అధికారులకు ఫిర్యాదు చేయాలి కానీ, దాడి చేయడం సరికాదని స్పష్టం చేశారు. దళిత అధ్యాపకుడిపై దాడి చేసిన నిందితులను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో..

తిరుపతి కల్చరల్ : ప్రొఫెసర్ చెంగయ్యపై దాడికి నిరసనగా బీఎస్పీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌతమ్‌కుమార్, జోనల్ కో–ఆర్డినేటర్ పి.గుర్రప్ప మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రబాబు, రాష్ట్ర కార్యదర్శులు ప్రభాకర్, వేణుగోపాల్, శశికుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆద్యంతం.. ఆధ్యాత్మికం


మహతిలో కీర్తనలను ఆలపిస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్ : పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం వివిధ వేదికలపై కళాకారులు ఆలపించిన సంకీర్తనలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రం, అన్నమాచార్య కళామందిరం, శ్రీరామచంద్రపుష్కరిణి, తిరుచానూరు రోడ్డులోని శిల్పారామం, తిరుచానూరు ఆస్థాన మండపంలో కచేరీలు చేపట్టారు. శ్రోతలను మైమరిపించారు.


అన్నమాచార్య కళా మందిరంలో..

పకడ్బందీగా 'అచీవ్‌మెంట్' సర్వే


పాకాల : పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న ఎంఈఓ బాబ్జీ


చంద్రగిరిలో...

పాకాల : నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేను బుధవారం పకడ్బందీగా నిర్వహించినట్లు ఎంఈఓ బాబ్జీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ దామలచెరువు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి, ఓబులశెట్టివారిపల్లె ఉన్నత పాఠశాలలో 6వ తరగతి, ఇన్‌ఫ్యాంట్ జీసెస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 3, 9వ తరగతుల వారికి సర్వే నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా చేపట్టే పరీక్షలో తెలుగు, సైన్స్, సోషల్, ఇంగ్లిష్‌కు సంబంధించి మొత్తం 100 మార్కులకు ప్రశ్నలు ఉంటాయన్నారు. ఓఎమ్ఆర్ షీట్ విధానంలో పరీక్ష ఉంటుందని, ఫలితాల మేరకు విద్యార్థులు ఏ సబ్జెక్ట్‌లో వెనుకబడి ఉన్నారో తెలుస్తుందని వివరించారు.

బ్లూమింగ్ బడ్స్‌లో..

చంద్రగిరి : స్థానిక బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో బుధవారం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే చేపట్టారు. ఎంఈఓలు లలితకుమారి, భాస్కర్ బాబు ఆధ్వర్యంలో 30 మంది 6వ తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ శారద, అబ్జర్వర్ అనుప్రియ, పాఠశాల చైర్మన్ హితేంద్రనాథ్ రెడ్డి, ప్రిన్సిపల్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

శెట్టిపల్లె భూముల 'విచారణ' పొడిగింపు


అధికారులకు అర్జీలు, హక్కుపత్రాలు అందిస్తున్న ప్రజలు

తిరుపతి అర్బన్ : శెట్టిపల్లెలోని భూసమస్యలపై మూడు రోజులుగా చేపట్టిన బహిరంగ విచారణను మరో రోజు పొడిగిస్తున్నట్లు ఆర్‌డీఓ రామ్మోహన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ భూ సమస్యలకు సంబంధించి తొలి రోజు 52, రెండో రోజు 261, మూడో రోజు 285 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. ఆ మేరకు బాధితులు తమ భూ హక్కు పత్రాలను సమర్పించారన్నారు. అయితే ఇప్పటికీ ఎవరైనా ఉంటే అర్జీ, హక్కు పత్రాలను గురువారం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటలలోపు అందజేయాలని కోరారు. శుక్రవారం నుంచి పది రోజుల పాటు అర్జీలు, భూ హక్కు పత్రాల పరిశీలన చేపడతామని, ఈ నెల మూడో వారానికి మొత్తం ప్రక్రియ పూర్తిచేస్తామని వివరించారు.

కక్షగట్టి దుకాణాల తొలగింపు


కూల్చేసిన దుకాణాల ఎదుట నినాదాలు చేస్తున్న బాధితులు

పాకాల : స్థానిక ఆర్టీసీ బస్‌స్టాండ్‌కు సమీపంలోని పలు దుకాణాలను బుధవారం రాత్రి అధికారులు తొలగించారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులనే కారణంతో ముందస్తు నోటీసులు కూడా జారీ చేయకుండా తొలగించేశారు. దీనిపై బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ కక్షలతో నిరుపేదలైన తమ పొట్టకొట్టకండని వేడుకున్నారు. ఈ మేరకు తహసీల్దార్ నిత్యానందబాబుకు వినతిపత్రం అందించారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న దుకాణాలను మాత్రమే తొలగిస్తున్నామని అధికారులు వెల్లడించారు. దీనిపై బాధితులు మాట్లాడుతూ అందరికీ ఒకే న్యాయం ఉండాలని, పక్షపాతంతో వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. తమకు న్యాయం చేయకుంటే ఆందోళనకు దిగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మునీర్, వైఎస్సార్‌సీపీ సీపీ నేతలు గుండ్లూరి సురేష్, డాక్టర్ శివప్రసాద్, షాఫుదీన్, ఖాదర్‌వలీ, రహంతుల్లా, బషీర్, రజాక్, అబ్దుల్లా, హమాన్, యసాన్, షేక్, జిలాన్, అఫ్రీద్ పాల్గొన్నారు.

వ్యాపార వారధి!





ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతికి నిత్యం వేలాదిమంది యాత్రికులు రాకపోకలు సాగిస్తుంటారు. వివిధ వాహనాల్లో తిరుమలకు వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో ట్రాఫిక్ ఇక్కట్లు తొలగించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీనివాస సేతు పేరిట ఫ్లైఓవర్ నిర్మించింది. భక్తులు సులభతరంగా కొండకు ప్రయాణించే వెసులుబాటు కల్పించింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫ్లైఓవర్‌కు గరుడ వారధిగా పేరు మార్చింది. ఫ్లైఓవర్ వద్ద పలు దుకాణాల నిర్వహణకు అనధికారికంగా పచ్చజెండా ఊపింది. టీడీపీ, జనసేన నేతలకు ఈ వారధిని ఆదాయ వనరుగా అందించింది. చిరువ్యాపారుల నుంచి యథేచ్ఛగా మామూళ్లు వసూలు చేసుకునే అవకాశం అందజేసింది. దీంతో వారధి నిర్మించిన లక్ష్యం నీరుగారిపోతోంది. తిరునగరంలో ట్రాఫిక్ సమస్య మరింత పెరిగింది.
- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి